క్లుప్తంగా

శివదీక్ష ఎంతో పవిత్రమైనది



పడిపూజలో పాల్గొన్న స్వాములు

కొందుర్గు: శివదీక్ష ఎంతో పవిత్రమైనదని నియమనిష్ఠలతో దీక్షను నిర్వహిస్తే ముక్తి లభిస్తుందని గురుస్వామి భూపాలచారి సూచించారు. ఆదివారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం ఎల్కగూడెంలో గ్రామంలో ద్వాదశ జ్యోతిర్లింగ మహాపడి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో శివస్వాములు పూజలో పాల్గొన్నారు. దీంతో గ్రామమంతా శివనామస్మరణతో మార్మోగింది. పూజ అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు, యాదయ్య, వెంకటేష్, హరీష్, రామకృష్ణ, నర్సింలు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి పండుగ

కొత్తూరు: కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని స్టేషన్ తిమ్మాపూర్ గ్రామంలో ఆదివారం బొడ్రాయి పండగను స్థానికులు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రజలు బోనాలు ఊరేగించి బొడ్రాయికి నైవేద్యం సమర్పించా రు. అనంతరం స్థానిక నాయకులు బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు జోలీ రవీందర్, వస్పుల మహేందర్, శ్రీధర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాయింట్ కమిషనర్‌కు సన్మానం



శ్రీనివాస్‌ను సత్కారిస్తున్న నాయకులు

షాద్‌నగర్: పట్టణంలోని క్రిష్టియన్ కాలనీలో గల మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఒగ్గుకిషోర్ ఇంటికి వచ్చిన హైదరాబాద్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్రీనివాస్‌ను ఆదివారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పూలబొకేను అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఏసీపీ కుషాల్కర్, పద్మశాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.

మోటార్ బహూకరణ



మోటార్ బహూకరిస్తున్న దాతలు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం లాల్‌పహాడ్ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కోసం గుంజల్‌పహాడ్ గ్రామానికి చెందిన కృష్ణ సింగిల్ ఫేజ్ మోటార్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే తనయుడు మురళి చేతుల మీదుగా పాఠశాల ప్రత్యేకాధికారి రాగసుధకు మోటార్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె దాత కృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సయ్యద్ హఫీజ్, నాయకులు అంజయ్య, రాములు, బాబురావు, జబ్బార్, నర్సింగ్‌రావు, రామచంద్రయ్య, వెంకటేష్, విఠల్, ఇస్మాయిల్, అజ్మీర్ పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే ప్రజాప్రస్థానం



పాదయాత్రలో నడుస్తున్న నాయకులు

షాద్‌నగర్: వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల చేపట్టిన ప్రజాప్రస్థానం పాదయాత్రకు ఆదివారం వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎండీ.ఇబ్రహీం ఆధ్వర్యంలో నాయకులు తరలివెళ్లారు. జనగామ నియోజకవర్గంలో కొనసాగుతున్న ప్రజాప్రస్థానం పాదయాత్రలో వైఎస్ షర్మిలను కలిసి పాదయాత్రకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పాదయాత్రలో వైఎస్ షర్మిలతో కలిసి నడిచారు. రాష్ట్రంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకే వైఎస్ షర్మిల పాదయాత్రను చేపట్టారని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ మండల అధ్యక్షుడు గోపినాయక్, పట్టణ అధ్యక్షుడు డేవిడ్, నాయకులు రాజు, సాయిక్రిష్ణ, రాము, భిక్షపతి, మదన్‌మోహన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య పరిశ్రమలపై చర్యలు తీసుకోండి

కొత్తూరు: కొత్తూరు పారిశ్రామికవాడలో కాలుష్య నియంత్రణ పాటించని పరిశ్రమలపై పీసీబీ అధికారులు చర్యలు తీసుకోవాలని బీజేపీ కొత్తూరు మున్సిపాలిటీ అధ్యక్షుడు నాగరాజుచారి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. రాత్రి వేళల్లో ఆయా పరిశ్రమల నుంచి ఘాటైన వాసనతో కూడిన వాయు కాలుష్యం వెలువడుతుందన్నారు. దానికి తోడు మరికొన్ని పరిశ్రమల నిర్వాహకులు శుద్ధి చేయకుండానే కలుషిత జలాలను నేరుగా భూమిలోకి ఇంకిస్తున్నట్లు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలుష్య నియంత్రణ పాటించని పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉపాధి కూలీలకు భరోసా

- ప్రమాదబీమా రూ.50వేల నుంచి రూ.2లక్షలకు పెంపు
- మండలంలో 8,561 మందికి వర్తింపు



బొబ్బిలిగామ గ్రామంలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

షాబాద్: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు మరింత భరోసా కలిగించేలా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రమాద బీమా పరిహారాన్ని రెట్టింపు చేస్తూ నిర్ణయం తీసుకుంది. కూలీలు పనిచేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు మృతి చెందితే అందించే పరిహారాన్ని పెంచుతూ ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలతో పాటు వారి కుటుంబ సభ్యులకు ప్రయోజనం జరగనుంది. ఉపాధిహామీలో పనిచేస్తున్న సమయంలో కూలీలకు అనేక ప్రమాదాలు జరుగుతుండడం, ట్రాక్టర్లు, గడ్డపారలు తగలడం వంటి ఘటనలతో కూలీలు గాయాల పాలు అవుతుంటారు. కొన్ని సందర్భాల్లో మృత్యువాత పడుతుంటారు. ఇవే కాకుండా వడదెబ్బ, పాముకాటు, గుండెపోటుతో మృతి చెందినా ఈ పరిహారం అందనుంది.

పరిహారం ఇలా...

మండలంలో మొత్తం 41 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మొత్తం 6,589 జాబ్‌కార్డులు, 8,561 మంది కూలీలు ఉన్నారు. ఈ ఏడాది మండలంలో 2,07613 పనిదినాలను లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు 69 శాతం పని దినాలు పూర్తి అయ్యాయి. ఉపాధిహామీలో కూలీలు ప్రధానంగా నీటి నిల్వల పెంపునకు కందకాలు తవ్వకం, చెరువుల్లో పూడికతీత, కాలువ మరమ్మతులు, మొక్కల పెంపకం వంటి పనులు చేస్తుంటారు. ఈ పనులు చేస్తున్న సమయంలో కూలీలు గాయాలై పనిచేస్తున్నందుకు అర్హులు అయితే గతంలో బాధితులకు రూ. 25వేలు వచ్చేవారు. ఇప్పుడు దానిని రూ. 50 వేలకు పెంచారు. ఇక చికిత్సకు అయ్యే ఖర్చును బట్టి లక్ష వరకు చెల్లిస్తారు. ఒకవేళ అంగవైకల్యం చెందితే గతంలో రూ. 50 వేలు చెల్లించేవారు. ప్రస్తుతం రూ.లక్షకు పెంచారు. ప్రమాదంలో ఛాతినొప్పి, గుండెపోటు, వడదెబ్బతో మృతి చెందితే ఇంతకు ముందు రూ. 50వేలు చెల్లింస్తుండగా ఇప్పుడు రూ. 2లక్షలకు పెంచారు. రోజువారి ఉపాధి పనులకు వచ్చే కూలీల విషయంలో అధికారులు ముందస్తుగానే జాగ్రత్తలు పడుతుంటారు. ఇందు వల్ల ఎక్కువ ప్రమాదాలు జరగడం లేదు. కేవలం వేసవికాలంలో కూలీలు అక్కడక్కడ వడదెబ్బ బారిన పడి చనిపోతుంటారు. ఇటీవల ప్రభుత్వం పెంచిన ప్రమాదబీమా పరిహారం ఉపాధి కూలీలకు ఎంతగానో ఉపయోగపడనుంది.

బీమా రెట్టింపు హర్షణీయం



ఉపాధిహామీ పనులు ఎక్కువగా నిరుపేదలే చేస్తుంటారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పేద కూలీలకు కొండంత భరోసానిచ్చింది. పని ప్రదేశాల్లో అనుకోకుండా ఏమైనా ప్రమాదాలు జరిగితే కొంత మేర పరిహారం ఇచ్చేవారు. ఇప్పుడు దాన్ని రెట్టింపు చేయడం మంచి నిర్ణయం.

–కిష్టయ్య, కూలీ తాళ్లపల్లి

కూలీలకు ప్రయోజనం



సాధారణంగా ఉపాధి పనులకు వచ్చే కూలీలకు ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త పడుతుంటాం. ఎక్కువ మంది కూలీలు వేసవి సీజన్‌లోనే ఈ పనులకు వస్తుంటారు. ఉపాధి కూలీలకు ప్రమాద పరిహారం అందజేస్తుంటారు. ఇప్పుడు ప్రభుత్వం ప్రమాద బీమా రెట్టింపు చేయడం మంచిదే ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కూలీలకు ఉపయోగకరంగా ఉంటుంది.

–వీరాసింగ్, ఏపీఓ షాబాద్

చెత్తకుండిగా మారిన విద్యుత్ సబ్‌స్టేషన్



విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో వేసిన చెత్తాచెదారం

మొయినాబాద్: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ చెత్తకుండిగా మారింది. సబ్‌స్టేషన్ ఆవరణ మంతా చెత్తకుప్పలతో నిండిపోయింది. మొయినాబాద్‌లో ప్రతి సోమవారం సంత జరుగుతుంది. సబ్‌స్టేషన్ ప్రహరీ గోడ పక్క నుంచి ఉన్న రోడ్డుపై సంతరోజు కూరగాయలు, ఇతర వస్తువులు విక్రయిస్తారు. సంత ముగిసిన తరువాత మిగిలిపోయిన వ్యర్థాలను ప్లాస్టిక్ కవర్లలో నింపి ప్రహరీ గోడ లోపలికి పడేస్తున్నారు. రోడ్డు పక్కన ఉన్న షాపుల నుంచి కూడా వ్యర్థాలను సబ్‌స్టేషన్ లోపలికి వేస్తుండడంతో ఆవరణమంతా చెత్తకుండిగా మారింది. పారిశుద్ధ్య నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించాల్సిన గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో పరిస్థితి దయనీయంగా తయారైంది. సబ్‌స్టేషన్‌తో పాటు మండల కేంద్రంలోని పలు కాలనీల్లో, రోడ్ల పక్కన చెత్తాచెదారం పేరుకు పోతుంది. తద్వారా దోమలు, ఈగలు చేరి రోగాలు వస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

మున్సిపాలిటీలో నేటి నుంచి 'కంటి వెలుగు'



స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు

డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమం మున్సిపాలిటీ పరిధిలో నేటి(సోమవారం)నుంచి ప్రారంభం కానుందని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి అన్నారు. ఆదివారం మున్సిపల్ చైర్మన్ నరేందర్, కమిషనర్ వెంకన్నతో కలిసి పట్టణంలోని 14వ వార్డులో ఏర్పాటు చేసే 'కంటి వెలుగు' స్థలాన్ని జయలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కంటి వెలుగు కార్యక్రమాన్ని 14వ వార్డులోని సుభాష్‌చంద్రబోస్ విగ్రహం వద్ద ఉదయం 9గంటలకు ప్రారంభిస్తామని తెలిపారు. పట్టణ ప్రజలు కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొని కంటి సమస్యలకు చికిత్స పొందాలని సూచించారు. దూరం చూపు, దగ్గర చూపు ఉన్న వారికి పరీక్షలు చేసి కంటి కళ్ళద్దాలను ఇస్తామన్నారు. ఈ కంటి వెలుగు ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ హాజరై ప్రారంభిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నర్సింలు, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, మున్సిపల్ అధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీపీ జ్యోతికి నేషనల్ అవార్డు



ఎంపిక పత్రాన్ని అందుకుంటున్న ఎంపీపీ

కందుకూరు: కందుకూరు ఎంపీపీ మంద జ్యోతి పాండు ఉమెన్ లీడర్ షిప్ నేషనల్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు బహుజన సాహిత్య అకాడమీ(బీఎస్ఏ)జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా ఆదివారం హైదరాబాద్‌లోని వారి కార్యాలయంలో ఆమెను సన్మానించి ఎంపిక పత్రం అందజేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సాహిత్యాన్ని ముందుకు తీసుకెళ్లడం కోసం బహుజన సాహిత్య అకాడమీ ప్రతి ఏటా ప్రజా ఉద్యమకారులు, సంఘ సేవకులు, రచయితలు, కవులు, స్వచ్ఛంద సంస్థలతో పాటు ప్రజాసేవ చేస్తున్న వారికి అవార్డులను అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఏడాది మార్చి 12న తిరుపతిలో నిర్వహించే బహుజన రైటర్స్ 6వ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్ సందర్భంగా ఉమెన్ లీడర్ షిప్ నేషనల్ అవార్డును అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎం గౌతమ్, కోఆర్డినేటర్ హనుమాండ్ల విష్ణు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరికలు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న గణేష్, రవీందర్‌యాదవ్

జెడ్పీవైస్ చైర్మన్ గణేష్

నందిగామ: బీఆర్ఎస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేష్ అన్నారు. మండల పరిధిలోని మొదళ్లగూడ గ్రామానికి వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ నివాసంలో ఎంపీపీ రవీందర్‌యాదవ్, గణేష్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసిన ఘనత ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌కే సొంతమని వివరించారు. రోడ్లు, భవనాలు, డబుల్ బెడ్ రూం ఇళ్లు, ప్రభుత్వ ఆస్పత్రి తదితర అభివృద్ధి పనులు నియోజకవర్గంలో జోరుగా సాగుతున్నాయన్నారు. పార్టీలో చేరిన వారిలో ముస్తఫా, ఇంద్రసేనారెడ్డి, రామకృష్ణ, హబీబ్, సజా ఉద్దీన్, పోచయ్య, రాములు, చంద్రయ్య, రెహ్మాన్, కరీం ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించండి



ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

కొత్తూరు: మండల కేంద్రంలోని నారాయణగూడ కాలనీలో ప్రధాన రోడ్డు పక్కన ఇళ్లమధ్యలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. నిత్యం ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో నుంచే వందలాది మంది సంచరిస్తుంటారని తెలిపారు. ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించిన ప్రమాదాలకు గురైయ్యే అవకాశం ఉందని ఆరోపిస్తున్నారు. గతంలో పలుమార్లు సంబంధిత శాఖలకు చెందిన అధికారులకు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని కోరిన పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు.

వైభవంగా శివ జయంతి



జెండాను ఆవిష్కరించిన బీకే లక్ష్మి

షాబాద్: ప్రతి ఒక్కరు ఆధ్మాత్మిక చింతన కలిగి ఉండాలని ప్రజాపిత బ్రహ్మకుమారి విశ్వవిద్యాలయం నిర్వాహకురాలు బీకే లక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో త్రిమూర్తి శివ జయంతి సందర్భంగా శాంతి జెండా కార్యక్రమం నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శివ జయంతి అనగా పరమాత్మ జన్మ తీసుకున్న రోజునే శివ జయంతి జరుపుకుంటామన్నారు. ఆత్మ పరమాత్మ గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతనతో ఉండాలన్నారు. భగవంతుడిపై నమ్మకం ఉంచాలన్నారు. యోగా మానసిక ఒత్తిడికి గురి కాకుండా చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఈశ్వరీయ విశ్వవిద్యాలయం అన్నయ్యలు, అక్కలు తదితరులున్నారు.

ఘనంగా మల్లన్న బోనాల ఉత్సవాలు



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

చేవెళ్ల: మండలంలోని ఖానాపూర్ గ్రామంలో ప్రజలు భక్తి శ్రద్ధలతో మల్లన్న బోనాల ఉత్సవాలను జరుపుకున్నారు. ఆదివారం గ్రామంలోని ప్రజలంతా చిన్న పెద్ద తేడా లేకుండా మల్లన్నస్వామి ఆలయానికి వెళ్లి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా వెళ్తుంటే బోనాల ముందు పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, డప్పుల చప్పులు మధ్య సందడి నెలకొంది. కురుమ సంఘం నాయకులు మల్లన్న బోనాల ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. గ్రామ సర్పంచ్ శ్రీలత, కురుమ సంఘం మండల నాయకులు వెంకటేష్, గ్రామ సంఘం నాయకులు క్రిష్ణ, అంజనేయులు, మహేందర్, గ్రామపెద్దలు, నాయకులు అంతా కలిసి గ్రామంలో మల్లన్న బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు.

జాతీయ రహదారులను దిగ్బంధిస్తాం

షాద్‌నగర్‌టౌన్: ఎమ్మార్పీఎస్ ఏబీసీడీ వర్గీకరణ సాధనలో భాగంగా నేడు(సోమవారం) హైదరాబాద్, విజయవాడ జాతీయ రహదారులను దిగ్బంధం చేసి తీరుతామని మహాజన సోషలిస్టు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చిన్నోళ్ల అనంతయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన 100రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పిస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. నరేంద్రమోడీకి మందకృష్ణమాదిగ పలుమార్లు వినతులను ఇచ్చినా చట్టబద్ధత విషయంలో న్యాయం జరగలేదని పేర్కొన్నారు. వర్గీకరణ బిల్లుకు అన్ని పార్టీలు మద్దతు ప్రకటించినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిపించడానికే జాతీయ రహదారులను దిగ్బంధం చేసేందుకు మాదిగలు సిద్ధమయ్యారని చెప్పారు. రాబోయే రోజుల్లో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో శివ మహాపడిపూజ



మహాపడిపూజ నిర్వహిస్తున్న గురుస్వామి

షాబాద్: ప్రతి ఒక్కరు దైవచింతన అలవర్చుకోవాలని శివానంద గురుస్వామి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని సాయిరెడ్డిగూడ మలన్న సన్నిధిలో శివస్వాముల మహా పడిపూజ ఘనంగా జరిగింది. గురుస్వామి శంకరయ్య ఆధ్వర్యంలో ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఇరుముడులతో శ్రీశైలం యాత్రకు శివస్వాములు పయనమయ్యారు. అనంతరం పడిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా శివానంద గురుస్వామి మాట్లాడుతూ.. భగవంతుడు శివపరమాత్ముడు భూమిపై అవతరించి స్వర్గాన్ని స్థాపించాడని తెలిపారు. పూర్వకాలంలో దేవాలయాలు, భగవంతుని ఆరాధనకే కాకుండా న్యాయం చెప్పడం, విద్య తదితర కార్యక్రమాలకు నెలవుగా ఉండి ధర్మ పరిరక్షణ కోసం నిలిచేవని చెప్పారు. గంగ, గోవు, గీత, గోవిందుడు, గురువులను పరిరక్షించుకుని హిందూ ధర్మాన్ని పటిష్టం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శివస్వాములు, గ్రామస్తులు తదితరులున్నారు.

హామీలను నెరవేర్చడంలో బీఆర్‌ఎస్ విఫలం

బీజేపీ నాయకుడు శ్రీవర్ధన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని గంజ్‌లో శక్తి కేంద్ర ఇన్‌చార్జి శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో 'ప్రజాగోస...బీజేపీ భరోసా' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ...రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం దుర్మార్గపు పాలన చేస్తుందని మండిపడ్డారు. నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు. తెలంగాణకు పూర్తిస్థాయిలో నీళ్లు లేవు, నియామకాలను తన కుటుంబానికి మాత్రమే ఇచ్చుకున్నారని ఆరోపించారు. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ సుపరిపాలన చేస్తుంటే జీర్ణించుకోలేక కేంద్రంపై ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మోడీ హయాంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి వెంకటేష్ గుప్త, విష్ణువర్ధన్‌రెడ్డి, వంశీకృష్ణ, మురళి, వెంకటేష్, మోహన్‌సింగ్, న్యూసిటీ శ్రీనివాస్‌చారి, నర్సింహ్మా, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, రమేష్ పాల్గొన్నారు.

కేసీఆర్ మాటలు నమ్మొద్దు

కొందుర్గు: కేసీఆర్ ఎన్నికల జిమ్మిక్కులను నమ్మకూడదని, ఇంతకాలం చేసిన మోసాన్ని మరవొద్దని బీజేపీ నాయకులు అందె బాబయ్య అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో జిల్లేడ్ చౌదరిగూడ మండలం గాలిగూడలో నిర్వహించిన 'ప్రజాగోస బీజేపీ భరోసా' అనే కార్యక్రమానికి బాబయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేసీఆర్ కుటుంబ పాలన, బీఆర్ఎస్ మంత్రుల కుంభకోణాలు, బూటకపు వాగ్దానాలు ఎవరు నమ్మకూడదన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఓట్లకోసం వస్తే ఇదివరకు ఇచ్చిన హామీలను నెరవేర్చాకే రావాలని పశ్నించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు కురుమయ్య, నాయ కులు వెంకటేశ్వర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, జగదీష్, శ్రీను, వెంకటేష్,యాదయ్య పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్‌తో పేదలకు లబ్ధి

పట్టణ బీజేపీ అధ్యక్షుడు నాగరాజుచారి

కొత్తూరు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని కొత్తూరు మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు నాగరాజుచారి కోరారు. ఇందులో భాగంగా ఆదివారం పలువురు లబ్ధిదారులకు ఆయన ఆయుష్మాన్‌భారత్ ఇన్సూరెన్స్ కార్డులను అందజేశారు. అనంతరం ఆయనతో పాటు పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఈ పథకం ద్వారా 600 రకాల రోగాలకు ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్సలు పొందే వీలుందన్నారు. కార్డు పొందిన లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం రూ.5 లక్షల ఉచిత హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులను అందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు అరవింద్, శ్రీనివాస్, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

బాలింతలు, గర్భిణులకు విటమిన్ పౌడర్ అందజేత

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని లింగారెడ్డిగూడ, నాగులపల్లి, రాసుమల్లగూడ గ్రామాల్లో ఆదివారం పాలమూరు చారిట్రబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నమో మాతృమూర్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని బాలింతలు, గర్భిణులకు విటమిన్ లోపం రాకూడదనే ఆలోచనతో ఒక్కొక్కరికి నాలుగు ప్రోటీన్ విటమిన్ పౌడర్ బాక్సులను అందజేశారు. బాలింతలు, గర్భిణులు తప్పనిసరిగా పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విష్ణువర్ధన్‌రెడ్డి, మోహన్‌సింగ్ నాయక్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

నందిగామలో జేఆర్‌ఆర్ ట్యాక్స్



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న రజనీ కాంత్

పీఏసీఎస్ డైరెక్టర్ రజనీకాంత్

నందిగామ: మండల కేంద్రమైన నందిగామలో ఏ భూమి సమస్య వచ్చినా వాటిని పరిష్కరించాలంటే జేఆర్‌ఆర్ ట్యాక్స్ చెల్లించాల్సిన దుస్థితి వచ్చిందని నందిగామ పీఏసీఎస్ డైరెక్టర్ జంగ రజనీకాంత్ ఆరోపించారు. నందిగామలోని చౌరస్తా సమీపంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగ నర్సింహాయాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన జంగ రజనీకాంత్ మాట్లాడుతూ.. స్థానిక సర్పంచ్, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడిపై తీవ్ర ఆరోపణలు చేశారు. గ్రామాభివృద్ధిని ఏ మాత్రం పట్టించుకోలేని సర్పంచ్ భూములు, ప్లాట్ల సమస్యలు అతడి దృష్టికి వచ్చినట్లయితే వాటికి తన వంతు వాటాగా ట్యాక్స్ (జేఆర్‌ఆర్) రూపంలో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. ఆర్అండ్‌బీ శాఖ ద్వారా రోడ్డును వేయించి దానిని తామే చేసినట్లుగా ప్రారంభోత్సవాలు నిర్వహించడం సిగ్గుచేటని విమర్శించారు. జెడ్పీటీసీ సైతం కాంగ్రెస్ పార్టీని విమర్శించే ముందు తన తమ్ముడికి రేషన్ షాపు ఎవ్వరి పుణ్యానా వచ్చిందో ఆత్మ పరిశీలన చేసుకోవాలని దుయ్యబట్టారు. కాంగ్రెస్‌ను విమర్శించే ముందు బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వం, ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి ఏమిటో ఒకసారి వెనక్కు చూసుకోవాలని ఆయన హితవు పలికారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యు లు కొమ్ము కృష్ణ, చంద్రపాల్ రెడ్డి, దేవల్లి కుమార్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోపణల్లో వాస్తవం లేదు..

కాంగ్రెస్ పార్టీ నేతలు ఆరోపిస్తున్న మాటల్లో వాస్తవం లేదని సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు, స్థానిక సర్పంచ్ జిల్లెల్ల వెంకట్‌రెడ్డి అన్నారు. కష్టపడి పనిచేసే వారిని విమర్శించడం మంచి పద్ధతి కాదన్నారు. వ్యక్తిగత ఆరోపణలు చేయడం సమంజసం హెచ్చరించారు.

–జి. వెంకట్‌రెడ్డి, నందిగామ సర్పంచ్